www.samasamajam.in

# సమ సమాజం

ప్రశ్నించే అక్షరం... ప్రజలకోసం... తెలుగు దిన పత్రిక

తెలంగాణ | ఆది వారం, 25 సెప్టెంబర్ 2022 | ఎడిటర్ : గోసుకొండ వృద్విరాజు | సంపుటి - 07, సంచిక-158 | పేజీలు - 4 వెల రూ. 5/-

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak

# బతుకమ్మ

## ఉత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు

రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్న చీరల పంపిణీ





రూ. 340 కోట్ల వ్యయంతో ఒక కోటి 18 లక్షల చీరల పంపిణీ

సిఎం కెసిఆర్ ఆదేశాలతో కొనసాగుతున్న కార్యక్రమం

**హైదరాబాద్, సెప్టెంబర్ 24 (సమ సమాజం):** బతుకమ్మ ఉత్సవాలను తెలంగాణ మహిళలు ఘనంగా జరుపుకునేలా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. బతుకమ్మ పండుగకు తీరొక్క పువ్వుతో గౌరమ్మను అలంకరించినట్లే బతుకమ్మ ఆడటానికి వెళ్లే మహిళలు తీరొక్క రంగు చీరల్లోఅందంగా ముస్తాబవ్వడానికి ప్రభుత్వం వాటిని తయారు చేయించింది. తెలంగాణ ఆడ బిడ్డలు గొప్పగా జరుపుకునే ఈ బతుకమ్మ పండుగను మహిళలు ఆత్మగౌరవంతో జరుపుకునేలా కొన్ని సంవత్సరాలుగా వారికి ఉచితంగా చీరలను ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు తెలంగాణ చేనేత సహకార సంస్థ ( టెస్కో) ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా కోటి బతుకమ్మ చీరల పంపిణీ ముమ్మరంగా కొనసాగుతుంది. 240 పైచిలుకు వెరైటీ డిజైన్‌లతో చీరలు తయారు చేశారు. ఒక కోటి 18 లక్షల చీరలు మహిళలకు పంపిణీ చేస్తున్నారు. ఆయా జిల్లాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇతర స్థానిక ప్రజా ప్రతినిధులు ఈ పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. ఇటీవల మంత్రి కేటీఆర్ సిరిసిల్ల పట్టణంలో జరిగిన 3లో

# ఇబ్రహీంపట్నం ఆపరేషన్ల ఘటనపై చర్యలు

డాక్టర్ జోయల్‌పై క్రిమినల్ కేసు నమోదు

ఇకముందు ఆపరేషన్ల కోసం మార్గదర్శకాలు విడుదల



**హైదరాబాద్, సెప్టెంబర్ 24 (సమ సమాజం):** ఇబ్రహీంపట్నం కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల ఘటన బాధ్యులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకున్నది. రంగారెడ్డి డీఎంహెచ్‌వో స్వరాజ్యలక్ష్మి, డీసీహెచ్ఎస్ ఝాన్సీ లక్ష్మిపై బదిలీ వేటువేసింది. ఆపరేషన్లు చేసిన డాక్టర్ జోయల్ సునీల్ కుమార్‌పై క్రిమినల్ కేసు నమోదు చేసింది. వీరితోపాటు మొత్తం 13 మందిపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేలా మార్గదర్శకాలు 3లో

# మొండి బకాయిలపై బ్యాంకుల నిర్లక్ష్యం

ఎగవేత వేసిన వారికి భయమేదీ

ఖాతాదారులకు వదులుతున్న చమురు




**ముంబయి, సెప్టెంబర్ 24 (సమ సమాజం):** మొండి బాకీల భారం సామాన్యులపై భారీగా పడుతోంది. వాటి నష్టాన్ని పూడ్చుకోవడానికే అన్నట్లుగా బ్యాంకులు ఖాతాదారులపై ఇష్టం వచ్చినట్లుగా ఛార్జీలు వేస్తున్నారు. ఇటీవల మాజీ ఎంపి గీత వ్యవహారమే తీసుకుంటే ఎగవేత వేసినా నష్టం లేదన్న భావనలో ఉన్నారు. ఆమె బెయిల్‌పై వచ్చినా సహకరించిన బ్యాంక్ అధికారులు మాత్రం ఊచలు లెక్కిస్తున్నారు. ఇలాంటి వారి భరతం పట్టే ఉపాయాలు ఆలోచించడం లేదు. సామాన్యుల రుణాల విషయంలో ముక్కుపిండి వసూలు చేస్తున్న బ్యాంకులు పెద్దల విషయంలో మిన్నకుంటున్నారు. ఇకపోతే పెద్ద నోట్ల రద్దు తరవాత ఆయా బ్యాంకులు 3లో

# మదర్ డెయిరీ డైరెక్టర్ల ఎన్నికపై ఉత్కంఠ

మునుగోడు ఉప ఎన్నిక నేపథ్యంలో ఆసక్తి

పావులు కదుపుతున్న అధికార టిఆర్ఎస్ పార్టీ




**నల్లగొండ, సెప్టెంబర్ 24 (సమ సమాజం):** నల్లగొండ-రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘం లిమిటెడ్ మదర్ డెయిరీ ఎన్నికల ప్రక్రియ ఉత్కంఠ రేపుతున్నది. డైరెక్టర్ల ఎన్నిక, చైర్మన్ పీఠం ఎవరికి అనేది ఆసక్తి కలిగిస్తోంది. డైరెక్టర్ల ఎన్నిక గతంలో అనేకమార్లు ఏకగ్రీవమైంది. మదర్ డెయిరీలో మొత్తం 15 మంది డైరెక్టర్లు ఉంటారు. తాజాగా మూడు ఖాళీ కావడంతో వాటికి ఈనెల 27న ఎన్నిక జరగనుంది. అంతా సవ్యంగా సాగి అధికార పార్టీలో అసమ్మతి ఛాయలు లేకపోతే ఆ మూడు స్థానాలు అధికార పార్టీ గెలుచుకోవడం ఖాయం. 3లో

# నకిలీ ఆధార్ కార్డులకు చెక్

ఐదేళ్లు పైబడ్డ వారికి ఆధార్ జారీలో నిబంధనలు




**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 24 (సమ సమాజం):** ప్రస్తుతం కొంతమంది నకిలీ ఆధార్ కార్డులు కూడా పొందారనే ప్రచారం సాగుతోంది. ఈనేపథ్యంలో నకిలీ కార్డుల విషయంలో కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించింది. దీంతో అక్టోబర్ 1 నుంచి కొత్త నిబంధనలు తీసుకురానుంది. దేశంలో 18 3లో

# ప్రధాని మోడీ హత్యకు పిపిఎఫ్ కుట్ర

**హైదరాబాద్, సెప్టెంబర్ 24 (సమ సమాజం):** ప్రధాన మంత్రి నరేంద్రమోదీ హత్యకు పిపిఎఫ్ నేతలు ప్లాన్ చేశారన్న వార్తలు ఒక్కసారిగా కలకలం రేపుతున్నాయి. ఈఏడాది జులైలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాట్నా టూర్ టార్గెట్ చేసుకుని పిపిఎఫ్ కుట్రలు పన్నిందని, దీనికోసం ప్రత్యేకంగా కొందరికి శిక్షణ ఇచ్చినట్లు ఎన్ఐఎ అధికారుల విచారణలో వెల్లడైనట్లు తెలుస్తోంది. ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడుతోందన్న కారణంతో పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా కదలికలపై దేశవ్యాప్తంగా జాతీయ దర్యాప్తు సంస్థ చేపట్టిన దాడులతో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఏకంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీని హత్య చేసేందుకు కుట్ర పన్నినట్లు తెలియడంతో ఈవిషయం ఇప్పుడు సంచలనం సృష్టిస్తోంది. ఈఏడాది జూలై 12వ తేదీన బీహార్ లోని పాట్నా సభలో విధ్వంసం సృష్టించేందుకు భారీగా నిధుల సమీకరణ కూడా జరిగిందని, పీఎఫ్ఐ బ్యాంకు ఖాతాలకు 120 కోట్ల రూపాయల నిధులు వచ్చిచేరినట్లు ఎన్ ఐఎ విచారణలో తేలినట్లు సమాచారం. దేశంలోని వ్యక్తుల నుంచే కాకుండా విదేశాల నుంచి కూడా ఈసంస్థకు నిధులు వచ్చినట్లు విచారణలో తేలింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ తో పాటు ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన మరికొందరు ప్రముఖులపైనా దాడులకు కుట్ర జరిగిందని, దాడులు చేసేందుకు పలువురికి శిక్షణ ఇచ్చినట్లు గుర్తించామని ఎన్ఐఎ వర్గాలు తెలిపాయి. దేశంలో అలజడి సృష్టించేందుకు పిపిఎఫ్ కుట్ర పన్నుతుందన్న సమాచారంతో అధికారులు రంగంలోకి దిగారు. పిపిఎఫ్ ఉగ్రవాద కార్యకలాపాలపై దర్యాప్తు ముమ్మరం చేశారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా 15 రాష్ట్రాల్లో సోదాలు నిర్వహించి 105 మందిని అరెస్ట్ చేశారు ఎన్ఐఎ దాడుల తర్వాత పీఎఫ్ఐ ఆర్థిక 3లో



పాట్నాలో అల్లర్లు సృష్టించి హత్యకు పథకం

ఇందుకోసం విదేశాల నుంచి 120 కోట్లు సేకరణ

ఎన్ఐఎ దాడులతో విస్తుపోయే నిజాలు వెల్లడి


# రసవత్తరంగా కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నిక

పోటీ నుంచి తప్పుకున్న దిగ్విజయ్ సింగ్

పేరుకు పలువురు పోటీ.. గెహ్లోట్‌కే పెద్దల మద్దతు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 24 (సమ సమాజం):** కాంగ్రెస్ జాతీయ అధ్యక్ష ఎన్నిక రసవత్తరంగా మారుతోంది. అధ్యక్ష ఎన్నికకు సంబంధించి 22న నోటిఫికేషన్ విడుదలయ్యింది. అధ్యక్ష ఎన్నికల్లో ఎవరెవరు బరిలో నిలుస్తారన్న అంశం రాజకీయ వర్గాల్లో ఆసక్తిరేపుతోంది. అయితే ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్ఇనక జరిపించామని చెప్పడానికి ఈ తంతు అన్నచందంగా ఉంది. ఎవరు అధ్యక్షుడయినా మళ్లీ సోనియా, రాహుల్‌దే పెత్తనం అని పార్టీలో ప్రచారం ఉంది. గాంధీ కుటుంబం నుంచి ఎవరూ అధ్యక్ష ఎన్నికల బరిలో 3లో

# మంత్రి జగదీశ్ రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం



**యాదాద్రి భువనగిరి, సెప్టెంబర్ 24 (సమ సమాజం):** మంత్రి జగదీష్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ బీజేపీ నాయకులు నిరసనకు దిగారు. చౌటుప్పల్ మండల కేంద్రంలో మంత్రి జగదీష్ రెడ్డి దిష్టిబొమ్మను బీజేపీ శ్రేణులు దహనం చేశాయి. నిన్న సింగల్ విండో నూతన భవనానికి శంకు స్థాపన చేసే కార్యక్రమంలో గొంగిడి మహేందర్ రెడ్డి ప్రసంగిస్తూ బీజేపీ ని విమర్శించడంతో రాజకీయాలకు ఇది వేదిక కాదన్న సహకార సంఘ డైరెక్టర్ల పై విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్వర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. బీజేపీ వారిని గుడ్డలు ఊడతీసి కొడతా అని మంత్రి అనుచిత వాఖ్యలు చేయడం సరికాదని బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి జగదీష్ రెడ్డి వ్యాఖ్యలకు నిరసనగా ఆయన దిష్టి బొమ్మను జాతీయ రహదారి పై ఊరేగించి దహనం చేశారు.

# టీఎస్ పీఈసెట్ -2022 ఫలితాలు విడుదల

95.93 శాతం ఉత్తీర్ణత సాధించారు

ఉన్నత విద్యా మండలి చైర్మన్ లింబాద్రి

**హైదరాబాద్, సెప్టెంబర్ 24 (సమ సమాజం):** టీఎస్ పీఈసెట్ -2022 ఫలితాలు విడుదలయ్యాయి. ఈ ఫలితాలను రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆర్ లింబాద్రి, మహాత్మాగాంధీ యూనివర్సిటీ వీసీ సీహెచ్ గోపాల్ రెడ్డి కలిసి విడుదల చేశారు. టీఎస్ పీఈసెట్‌లో 95.93 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రకటించారు. బ్యాచులర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్(బీపీఈడీ) కోర్సుల్లో పురుష 3లో

# ఉత్తరాదిని కుదిపేస్తున్న భారీ వర్షాలు

ఢిల్లీ సహా పలు ప్రాంతాల్లో జోరు వానలు

నీట మునిగిన జాతీయరహదారులు

ఉత్తరాఖండ్‌లో విరిగిపడుతున్న కొండచరియలు



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 24 (సమ సమాజం):** దేశవ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. ఢిల్లీ, హర్యానా, ఉత్తరప్రదేశ్ లో భారీ వర్షాలతో జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. యూపీలోని గురుగ్రామ్‌లో రోడ్లు నీళ్లతో నిండిపోయాయి. వాహనాలు ఎక్కిడకక్కడ నిలిచిపోయాయి. దీంతో విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. ఉద్యోగులకు వర్క్ ఫ్రం హోం ఆప్షన్ ఇచ్చారు. భారీ వర్షాలకు ఉరుములు, గోడలు కూలడం, ఇళ్లు ధ్వంసం అవడం లాంటి ఘటనతో ఇప్పటివరకు 13 మంది చనిపోయారు. మరో 11 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఫిరోజాబాద్‌లో ఇళ్లల్లోకి నీరు 3లో

## సంపాదకీయం

# పతనమవుతున్న రాజకీయ విలువలు !

రాజకీయాల్లో రోజురోజుకూ విలువలు విలువలు పడిపోతున్నాయి. సిద్దాంతాలు పక్కకు పోయాయి. ఎదుటి పార్టీని ఎలా దిబ్బతీయాలా అన్నదే ఇప్పుడు అన్నిపార్టీల ప్రథమ లక్ష్యంగా మారింది. ప్రాంతీయ పార్టీలు మొదలు, సిద్దాంత భావజాలాన్ని కలిగివున్న బిజెపి వరకు అధికారమే పరమావధిగా రాజకీయాలు నెరపు తున్నాయి. అధికారంలో ఉన్న పార్టీలోకి చేరడానికే నేతలంతా చూస్తున్నారు. తమ రాజకయ అవసరాన్ని ప్రజల అవసరంగగా చిత్రీకరించి పార్టీలు మారుతున్నారు. దీనికి ఎవరూ మినహాయింపు కాదు. ఈ క్రమంలో ప్రజలు, దేశం, సమస్యలు పక్కకుపోయాయి. వారు అనుకున్నదే అసలుసిసలు రాజకీయంగా మారింది. ఎంతటి నేతలైనా అధికారపార్టీలో చేరడానికి వెరవడం లేదు. రాజకీయనిబద్దత పక్కకుపెడుతున్నారు. అధికారపార్టీ అయితే తమ పబ్బం గడుపుకోవచ్చు. అందులో చేరడానికి సవాలక్ష కారణాలు చూపాల్సిన అసవరం లేదు. రాజకీయాల్లో విలువలు లేవని, వ్యక్తులకు పార్టీల పట్ట విశ్వాసం కన్నా పదవులపైనే మోహం ఉందనడానికి తాజా రాజకీయాలే ఉదాహరణ. మోడీ పనితీరు నచ్చిందని, దేశానికి ఆయనే ఆశాజ్యోతి అని ఆ పార్టీలో చేరేముందు సద్గుణాలు వల్లిస్తున్నారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీని వీడి కొత్త పార్టీ పెట్టిన పంజాబ్ మాజీ సిఎం కెప్టెటన్ అమరీందర్ సింగ్ బిజెపిలో చేరారు. గోవాలో 8మంది ఎమ్మెల్యేలు బిజెపిలోకి దూకారు. మహారాష్ట్రల శివసేనను వీడి వేరుకుంపటి పెట్టిన ఏక్‌నాథ్ షిండే బిజెపి మద్దతుతో అధికారం చేపట్టారు. తెలంగానలో పలువురు టిఆర్‌ఎస్‌లో చేరగా మరికొందరు బిజెపిలో చేరుతూనే ఉన్నారు. వీరంతా చెప్పేది ఒక్కటే..చేరిన పార్టీ మంచిదనే. ఇలా చేయడంలో కేవలం స్వార్థ రాజకీయాలు తప్ప మరోటి కాదు. వీటన్నింటిన అధికార పార్టీ పత్రికలు, మీడియా అదేపనిగా ప్రచారం చేస్తూ వాపును బలుపుగా చేస్తున్నాయి. గతంలో ఎప్పుడూ మీడియా ఇంతగా దిగజారిన దాఖలాలు లేవు.టిఆర్‌ఎస్‌లో ఉన్న పలువురు నేతలు వివేక్, కొడా విశ్వేశ్వర్ రెడ్డి, జితేందర్ రెడ్డి, ఈటెల రాజేందర్, రఘునందన్ రావు తదితరులంతా ఇప్పుడు బిజెపిలో ఉన్నారు. గతంలో టిడిపి నుంచి బిజెపిలో చేరిన వారిలో కొందరు మళ్లీ టిఆర్‌ఎస్‌లో చేరారు. ఉదాహరణ పెద్దిరెడ్డి,మోత్కుపల్లి నర్సింహులు,రమణల ఉదంతాలే. టిడిపిలో అనేక పదవులు అనుభ వించి, చంద్రబాబు అడుగలకు మడుగులొత్తి, తెలంగాణను, కెసిఆర్‌ను తీవ్రంగా వ్యతిరేకించిన వీరంతా తరిగి కెసిఆర్ గూటికి చేరారు. ఉద్యమ సమయంలో కెసిఆర్ తెలంగాణ వాడు కాదని, విజయనగరం నుంచి వలస వచ్చాడని పదేపదే ప్రచారం చేయడంలో మోత్కుపల్లి ముందున్నారు. టిడిపిలో అనేక పదవులు అనుభవించి, రాజకీయంగా ఎదిగి ఆ పార్టీని, దాని అధినేతలను తిట్టాల్సినన్ని తిట్లు తిట్టిన మోత్కుపల్లి తరవాత కొంతకాలానికి బిజెపిలో చేరారు. అలాగే పెద్దిరెడ్డి కూడా చేరారు. రమణ మాత్రం టిడిపిలోనే ఉన్నారు. కానీ సుదూరంలో రాజకీయ ఉనికి కానరాకపోవడంతో కారణాలు చూపుతూ టిఆర్‌ఎస్ పంచన పడ్డారు. కెసిఆర్ కూడా రాజకీయ ఎత్తులు వేస్తూ వీరిని అక్కున చేర్చుకున్నారు. వీరంతా టిఆర్‌ఎస్‌లోకి రావడం వెనక కారణాలు బహిరంగ రహస్యం. రాజ్యసభ సీటు, గవర్నర్ గిరీ ఆశించి భంగపడి, కనీసం టిటిడి బోర్డు మెంబర్ పదవి దక్కకపోవడంతో అప్పుడు టిడిపి అధినేతపై మోత్కుపల్లి అనేక విమర్శలు గుప్పించడం తెలిసిందే. బిజెపిలో చేరాక కూడా అదేపనిని చేశారు. పార్టీ మారదల్చు కుంటే మారాలి. అంతేగానీ వీడుతున్న పార్టీపై విమర్శలు చేస్తే ప్రజలు నమ్మరని నేతలు గుర్తించాలి. అలాగే టిడిపిలో ఉన్న వల్లభనేని వంశీ లాంటి వారు కూడా వైసిపిలో చేరారు. ఇలా విడుదల రజని కూడా గతంలో టిడిపి నుంచి వచ్చినవారే. రాజకీయ అవసరార్థం ఎప్పుడు ఏదైనా మాట్లాడే అలవాటు మన రాజకీయ నేతలకు ఉంది. ఇకపోతే కాంగ్రెస్ పార్టీలో జీవితాంతం పదవులు అనుభవించిన గులాంనబీ ఆజాద్. కపిల్ సిబల్ లాంటి వారు పార్టీని వీడడం దారుణం. బీజేపీ తిరుగుబాటు నేత యశ్వంత్ సిన్హా,శతృఘ్న సిన్హా లాంటి వారు కూడా పార్టీని వీడారు. వీరు కూడా మోడీ బాధితులు కావడంతో పార్టీ వీడక తప్పలేదు. మోడీ విధానాలపై వీరు బహిరంగంగానే విమర్శలు చేస్తున్నారు. పవార్, మమతా బెనర్జీ మాత్రమే కాదు, చాలామంది ప్రాంతీయ పార్టీల నాయకులు, ముఖ్యమంత్రులు అవకాశం వస్తే ఢిల్లీ గద్దెను ఎక్కాలనే కుతూహలంతో ఉన్నారు. బీజేపీయేతర పార్టీలు ఒకే వేదికపైకి వస్తే, సమిష్టి నాయకత్వం ఏర్పడే సూచనలున్నాయి. ఏకాభిప్రాయంతో వీరిలో ఎవరో ఒకరు నాయకులు కావచ్చు. రాష్ట్రాలలో తమ మధ్య విభేదాలు ఉన్నప్పటికీ, కేంద్రంలో బీజేపీకి వ్యతిరేకంగా చేతులు కలుపాలని సోనియా పిలుపునిచ్చారు. ఈ కూటమి వల్ల రాజకీయ వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందా అన్నది కాలం నిర్ణయిస్తుంది. అయితే వీరంతా అటుఇటుగా పార్టీలు మారుతూ సిద్దాంతాల గురించి మాట్లాడడమే ఆశ్చర్యంగా ఉంది. ఏ పార్టీకి కూడా సిద్దాంతం లేదన్నది గమనించాలి. అధికారమే అన్ని పార్టీల సిద్ధాంతం. అధికారం ఉంటేనే నేతలు పార్టీని అంటిపెట్టుకుని ఉంటారు. లేకుంటే అధికారం ఉన్న పార్టీలోకి జంప్ అవుతారు. ఇందుకు ఎవరుకూడా మినహాయింపు కాదు. రాష్ట్రం ఏదైనా, పార్టీ ఏదైనా అదికారం ఉంటే అదే తమ పార్టీ అన్న ధోరణిలో నేతలు ఉన్నారు. ఇది రాజకీయ పార్టీల పతనానికి దారితీస్తోంది. ప్రజల సమస్యలపై పోరాడే అవకాశం లేకుండా చేస్తోంది. రాజకీయనేతలు నిబద్దత కోల్పోతే ఎక్కువ కాలం నేతలుగా మనలేమని గుర్తిస్తు మంచిది.

పృధ్విరాజ్ గోసుకొండ
ఎడిటర్

# బతుకమ్మ వేడకలను ఘనంగా నిర్వహించాలి

సాంప్రదాయబద్ధంగా పండగకు ఏర్పాట్లు చేయాలి

అధికారులకు సూచించిన మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

నియోజకవర్గంలో చీరలు పంపిణీ చేసిన మంత్రి



**జనగామ, సెప్టెంబర్ 24 (సమ సమాజం):** రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రతి ఏటా ఘనంగా నిర్వహిస్తున్న బతుకమ్మ వేడుకల ఈ ఏడాది కూడా కన్నుల పండుగగా నిర్వహించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. పాలకుర్తి నియోజకవర్గంలోని పాలకుర్తి, దేవరుప్పులు, కొడకండ్ల, పెద్ద వంగర, తొర్రూరు, రాయపర్తి మండలాల ప్రజాప్రతినిధులు, అధికారులు, పోలీసులతో మంత్రి శనివారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, తెలంగాణ ఆవిర్భావం తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ గారు, బతుకమ్మ పండుగను రాష్ట్ర పండుగా ప్రకటించి, కన్నుల పండుగగా ప్రభుత్వం తరపుననే నిర్వహిస్తున్నారన్నారు. అంతేగాక దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రతి ఏటా కోటి మందికి పైగా బతుకమ్మ చీరలను అందిస్తున్నారని తెలిపారు. 339 కోట్లు ఖర్చు చేసి, అద్భుతంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ దశలోఈ ఏడాది పండుగను గతంలో కంటే మరింత వైభవంగా నిర్వహించాలని మంత్రి ఆదేశించారు. చెరువుల వద్ద నిమజ్జన ఏర్పాట్లు చేయండి. విద్యుత్ దీపాలు, అలంకరణతో ఆకర్షణీంగా నిమజ్జన స్థలాలు ఉండాలి. మహిళలకు రక్షణ, భద్రత ఏర్పాట్లు జరగాలి. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. నిమజ్జనం వద్ద మరింత జాగ్రత్తగా ఉండండి. అందరినీ, లోతైన ప్రదేశాలకు నిమజ్జనానికి ఎవరినీ అనుమతించవద్దని హితవు పలికారు. ప్రజాప్రతినిధులు అధికారులు, పోలీసులతో సమన్వయంతో మెలగాలి. బతుకమ్మ చీరలు మహిళలందరికీ అందేలా చూడాలి. బతుకమ్మ చీరలను అవమానించే వారి పట్ల అప్రమత్తంగా ఉండండి. అలాంటి వాళ్ళని ఉపేక్షించ వద్దని మంత్రి సూచించారు. బతుకమ్మల పోటీ పెట్టి బహుమతులు అంద చేయండి. డప్పు చప్పుళ్ళతో సంప్రదాయ బద్దంగా ఊరంతా వేడుకలా బతుకమ్మ పండు జరగాలని చెప్పారు. అలాగే దసరా వేడుకలకు కూడా ఘనంగా నిర్వహించాలని మంత్రి ఆదేశించారు. ఇదిలావుంటే రాష్ట్రంలో కోటి మంది ఆడబిడ్డలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తున్నామని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. బతుకమ్మ చీరల కార్యక్రమంతో నేతన్నల జీవితాల్లో వెలుగులలు నిండాయని, చేతినిండా పని లభించిందని చెప్పారు. జనగామ జిల్లా పాలకుర్తి నియోజకవర్గంలోని దేవరుప్పుల, కొడకండ్ల, పాలకుర్తి, పెద్ద వంగర, తొర్రూరు, రాయపర్తి మండల కేంద్రాల్లో మంత్రి ఎర్రబెల్లి లబ్దిదారులకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..ప్రజల పండుగలను ప్రభుత్వమే చేసే కొత్త సంప్రదాయాన్ని సీఎం కేసీఆర్ ఆరంభించారని చెప్పారు. బతుకమ్మను రాష్ట్ర పండుగగా నిర్వహించుకుంటున్నామని తెలిపారు. ప్రతి ఏడాది బతుకమ్మ పండుగ సందర్భంగా ఇంట్లో పెద్దకొడుకుగా సీఎం కేసీఆర్ ఆడపడుచు లకు చీరలు పంపిణీ చేస్తున్నారని వెల్లడించారు. ఈ సంవత్సరం 24 డిజైన్లు 10 రకాల ఆకర్షణీయమైన రంగుల్లో మొత్తం 240 రకాల దారపు పోగుల అంచులతో చీరలు రూపొందించామన్నారు. దీనికోసం ప్రభుత్వం రూ.339.73 కోట్ల ఖర్చు చేసిందని తెలిపారు. ఇలాంటి పథకం దేశంలో ఎక్కడా అమలవడం లేదని చెప్పారు. పాలకుర్తి నియోజకవర్గంలో రూ.3.70 కోట్ల విలువైన లక్షా 9 వేల 775 చీరలు పంపిణీ చేస్తున్నామన్నారు.

# నిబంధనల మేరకు పబ్‌ల నిర్వహణ

పరిసర ప్రజలకు ఇబ్బంది రాకూడదు

సౌండ్ పొల్యూషన్ లేకుండా చూడాలి

పబ్ యాజామాన్యాలతో సిపి స్టీఫెన్ రవీంద్ర సమీక్ష





**హైదరాబాద్, సెప్టెంబర్ 24 (సమ సమాజం):** సైబరాబాద్ పరిధిలోని పబ్‌లను నిబంధనల ప్రకారమే నిర్వహించాలని సీపీ స్టీఫెన్ రవీంద్ర అన్నారు. మైనర్లను పబ్‌లకు అనుమతించొద్దని చెప్పారు. నిబంధనలకు లోబడి ధ్వని స్థాయిలు ఉండాలని పబ్ యజమానులకు సూచించారు. పబ్బులపై పరిసర ప్రజల నుండి ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో... నివాసితులకు అసౌకర్యం కలిగించవద్దన్నారు. నిర్దేశించిన నిబంధనలను ఉల్లంఘించి పౌరులకు ఎటువంటి అసౌకర్యాన్ని కల్పించొద్దన్నారు. ఈ మేరకు సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పబ్‌ల యజమానులతో స్టీఫెన్ రవీంద్ర సమావేశం నిర్వహించారు. పబ్‌లను బాధ్యతాయుతంగా నిర్వహించాలని సీపీ స్టీఫెన్ రవీంద్ర సూచించారు. హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగా అన్ని నిబంధనలు, లైసెన్సింగ్ నిబంధనలకు లోబడి ఉండాలన్నారు. బ్యాకప్‌తో కూడిన సిసి ఫుటేజిని, ఫీడ్‌ను పర్యవేక్షించడానికి, ప్రాంగణాన్ని సౌండ్‌ప్రూఫ్ చేయడానికి, వాలెట్ డ్రైవర్‌లను నిమగ్నం చేయడానికి, సిబ్బంది, కస్టమర్లను పరీక్షించడానికి ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయాలని మేనేజ్‌మెంట్‌లకు సూచించారు. సౌండ్ పొల్యూషన్, పార్కింగ్ సమస్యలు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత యజమాన్యందే అన్నారు. హైదరాబాద్ నగరం, రాష్ట్ర ఖ్యాతిని నిలబెట్టాలన్నారు. అలాగే శబ్ద కాలుష్యం, పార్కింగ్ సమస్యలు తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చుట్టుపక్కల నివాసితులకు ఇబ్బంది లేకుండా పబ్బులు నిర్వహించుకోవాలని సైబరాబాద్ సీపీ తెలిపారు.

# ప్రమాదంలో గాయపడ్డ డాక్టర్ శ్రావణి మృతి

**హైదరాబాద్, సెప్టెంబర్ 24 (సమ సమాజం):** మూడు రోజుల క్రితం కారు ఢీకొన్న ఘటనలో గాయపడిన డాక్టర్ శ్రావణి చనిపోయింది. హైదరాబాద్ మలక్ పేట్ లో ఈ నెల 21న బైక్ ను కారు ఢీ కొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శ్రావణికి మూడు రోజుల నుంచి నిమ్స్ లో వైద్యులు ట్రీట్మెంట్ అందించారు. కానీ తలకి బలమైన గాయం కావడంతో ఆపరేషన్ చేసినా శ్రావణి బతకలేదు. పరిస్థితి విషమించి ఇవాళ శ్రావణి చనిపోయింది. హస్తినాపురంలోని ప్రైవేట్ హాస్పిటల్ లో శ్రావణి డెంటల్ డాక్టర్ గా పని చేసేవారు. మూడు రోజుల క్రితం శ్రావణి బైక్ పై వస్తుండగా... వేగంగా వచ్చి బైక్ ని ఢీకొట్టి కారు డ్రైవర్ పారిపోయాడు. హిట్ అండ్ రన్ కేసులో ఇవాళ శ్రావణి మ-?తి చెందడంతో ఆమె కుటుంబంలో శోకసంద్రంలో మునిగిపోయింది. ఈ ఘటనకు కారణమైన నిందితుడిని ఓల్డ్ మలక్ పేటకు చెందిన ఇబ్రహీంగా గుర్తించారు. అయితే నిందితుడికి లైసెన్స్, కారుకు పేపర్లు సైతం లేవని పోలీసులు వెల్లడించారు.

# లోన్‌యాప్‌కు మరో యువకుడు బలి

వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్య




**కరీంనగర్, సెప్టెంబర్ 24 (సమ సమాజం):** లోన్ యాప్‌కు మరో యువకుడి బలి అయ్యాడు. లోన్ యాప్ నిర్వాహకుల వేధింపులు తాళలేక నగునూర్‌కు చెందిన మునిసాయి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇటీవల లోన్ యాప్ ద్వారా సాయి రూ.10 వేలు తీసుకున్నాడు. గత ఆరు నెలలుగా లోన్ యాప్ నిర్వాహకులకు దాదాపు రూ.45 వేల వరకు చెల్లించాడు. అయితే ఇంకా రూ.15 వేలు కట్టాలని యాప్ నిర్వాహకుల వేధింపులకు గురిచేశారు. దీంతో వేధింపుతుల తట్టుకోలేదు ఈనెల 20న సాయి పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించగా... చికిత్స పొందుతూ సాయి మృతి చెందాడు. దీంతో తమకు న్యాయం చేయాలంటూ కుటుంబసభ్యులు ఆందోళనకు దిగారు.

# మునుగోడు ఉప ఎన్నికపై స్టీరింగ్ కమిటీ భేటీ



## వివేక్ అధ్యక్షతన గెలుపు వ్యూహాలపై చర్చ

**హైదరాబాద్, సెప్టెంబర్ 24 (సమ సమాజం):** మునుగోడు ఉప ఎన్నికలో గెలుపుకోసం అనుసరించాల్సిన వ్యూహంపై బిజెపి సమాలోచనలు చేస్తోంది. బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు వివేక్ వెంకటస్వామి ఛైర్మన్ గా 16 మంది నేతలతో ఏర్పాటైన బీజేపీ స్టీరింగ్ కమిటీ ఈ మేరకు పార్టీ కార్యాలయంలో ప్రత్యేకంగా సమావేశమైంది. రాజగోపాల్‌రెడ్డి కూడా హాజరు కాగా ఈ కమిటీ చర్చలు జరుపుతోంది. మునుగోడు నియోజకవర్గంలోని గ్రామాల వారీగా చేసిన సర్వే నివేదికను నేతలు పరిశీలిస్తున్నారు. గ్రామాల వారీగా కమిటీల నియామకంపై చర్చిస్తున్నారు. మండలాలకు ఇంఛార్జ్ ల నియామకం, ప్రచారం, చేరికలపై కమలం నేతలు ఫోకస్ పెట్టారు. ఈ భేటీలో స్టీరింగ్ కమిటీ సభ్యులైన హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్, జితేందర్ రెడ్డి, గరికపాటి మోహన్ రావు, విజయశాంతి, రవీంద్ర నాయక్, స్వామిగౌడ్, చంద్రశేఖర్, యెండల లక్ష్మీనారాయణ, యెన్నం శ్రీనివాసరెడ్డి, కపిలవాయి, ఆచారి, దాసోజు శ్రవణ్, కమిటీ కో ఆర్డినేటర్ మనోహర్ రెడ్డి హాజరయ్యారు. ఉప ఎన్నిక ప్రచారం, చేరికలు, ప్రచార వ్యూహాలపై చర్చించారు. మునుగోడులో ప్రతి ఓటర్ ను కలిసేలా ప్రచార కార్యాచరణను సిద్ధం చేస్తోంది. మునుగోడు ఉప ఎన్నిక కోసంఇప్పటి వరకు మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నీ తానై వ్యవహరి స్తున్నారు. ఆయన దూకుడు, బీజేపీ సైద్ధాంతిక పనితీరు మధ్య సయోధ్య కుదరక సంస్థాగత కమిటీల ఏర్పాటులో జాప్యం చోటుచేసుకుంది. పాత, కొత్త నాయకుల కలయికలతో ముందుకు వెళ్లాలని పలుమార్లు భేటీలు నిర్వహించారు. మొత్తంగా 601 మందితో వివిధ స్థాయిల్లో కమిటీలు ఖరారయ్యాయి. నియోజకవర్గం మొత్తంగా పర్యవేక్షణకు స్టీరింగ్ కమిటీ, ప్రతీ మండలానికి బయటి నుంచి ముగ్గురు కీలక నేతలు, ప్రతీ గ్రామానికి ముగ్గురు అందులో ఇద్దరు స్థానిక నేతలకు అవకాశం కల్పిస్తూ కమిటీలు ఏర్పాటుచేశారు. స్టీరింగ్ కమిటీని అధికారికంగా ప్రకటించారు. ఇదిలావుంటే మునుగోడు నియోజకర్గంలోని ప్రతీ మండలానికి, గ్రామానికి త్రీమెన్ కమిటీలను బీజేపీ నేతలు ఖరారు చేశారు. ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే, ఎంపీ, మాజీ ఎంపీ స్థాయి నేతలతో ముగ్గురు చొప్పున మండల స్థాయిలో త్రీమెన్ కమిటీని నియమించాలని నిర్ణయించి ఆ మేరకు జాబితా ఖరారు చేశారు. నియోజకవర్గంలో 159 పంచాయతీలు, 30మునిసిపల్ వార్డులు ఉన్నాయి. ప్రతీచోట ముగ్గురు చొప్పున 567 మందికి బాధ్యతలు కేటాయించారు. ప్రతీ మండలానికి ముగ్గురు చొప్పున ఆరు మండలాలకు 18మంది, 16 మందితో స్టీరింగ్ కమిటీ మొత్తం 601 మందితో ఎన్నికల టీం సిద్ధమైంది. పాత, కొత్త నేతలతోబీజేపీకి చెందిన పాత నాయకులు, మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డితోపాటు ఇటీవల పార్టీలో చేరిన కొత్త నాయకులతో మునుగోడు ఉప ఎన్నిక కమిటీలు ఖరారయ్యాయి. విద్యార్థి సంఘం నుంచి బీజేపీలో కొనసాగుతూ గతంలో మునుగోడు నియోజకవర్గం నుంచి రెండుసార్లు పోటీచేసిన గంగిడి మనోహర్‌రెడ్డిని కోఆర్డినేటర్‌గా నియమించారు. దీంతో పూర్తిస్థాయిలో బీజేపీ సైన్యం మునుగోడులో దిగనుంది. ఈ మేరకు కమిటీలో ప్రచార వ్యూహంపై కార్యాచరణ స ఇద్దం చేయనున్నారు.

# శ్రీశైలం మల్లికార్జున స్వామిని దర్శించుకున్న కవిత



**నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 24 (సమ సమాజం):** శ్రీశైలం మల్లికార్జున స్వామిని టీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత దర్శించుకున్నారు. స్వామిని దర్శించుకోవడం అదృష్టంగా భావిస్తున్నానని కవిత తెలిపారు. స్వామి వారిని దర్శించుకున్న అనంతరం అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజుతో కలిసి కవిత మీడియాతో మాట్లాడారు. మల్లికార్జున స్వామి, భ్రమరాంభ అమ్మవారిని ఎన్నిసార్లు చూసినా తనివి తీరదన్నారు. కుటుంబ సమేతంగా స్వామి వారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. స్వామి వారి దయ వల్ల తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలతో పాటు ప్రజలందరూ బాగుండాలని ప్రార్థించాను. శ్రీశైలం ఆలయం ఎంతో అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు. తిరుమల మాదిరిగానే శ్రీశైలం సన్నిధి కూడా ఎదగాలని మనస్పూర్తిగా కోరుకుంటున్నానని కవిత తెలిపారు.

# పరిశ్రమల స్థాపనలో టీఆర్ఎస్ నిర్లక్ష్యం

కేంద్రమంత్రి బిఎల్ వర్మ మండిపాటు

**వరంగల్, సెప్టెంబర్ 24 (సమ సమాజం):** టీఆర్ఎస్ ప్రభుత్వం పరిశ్రమలను నిర్లక్ష్యం చేస్తోందని కేందమంత్రి బీఎల్ వర్మ అన్నారు. కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్కు ద్వారా వేల ఉద్యోగాలు కల్పిస్తామని ..తెలంగాణ ప్రభుత్వం.. పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఒక్క పరిశ్రమే కాదు..తెలంగాణ సర్కారు అన్ని రంగాలను నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. మడికొండ వీవర్స్ సొసైటీ సభ్యులు విన్న వించిన సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని బీఎల్ వర్మ హామీ ఇచ్చారు. అంతకుముందు ప్రవాసీ యోజన్ కింద పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రైతులతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. కార్యక్రమంలో గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కాళేశ్వరంతో లక్షకోట్ల ప్రజాధనం వృధా

పాలకులే కాదు.. పాలన మారాల్సిన అవసరం ◆ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనంలో టీజేఎస్ అధ్యక్షుడు కోదండరామ్



**హన్మకొండ, సెప్టెంబర్ 24 (సమ సమాజం):** కాళేశ్వరం ప్రాజెక్టు పనికిరాదని ఇంజనీరింగ్ అధికారులు చెప్పినా.. కేసీఆర్ లక్ష కోట్లు ఖర్చు చేసి ప్రజాధానం దుర్వినియోగం చేశారని తెలంగాణ జనసమితి అధ్యక్షుడు కోదండరామ్ ఆరోపించారు. పాలకులే కాదు.. పాలన మారాల్సిన అవసరం వచ్చిందని.. దోపిడీ, నిరంకుశ ప్రభుత్వాన్ని కూలదోయాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనంలో టీజేఎస్ అధ్యక్షుడు కోదండరామ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్య, వైద్య, వ్యవసాయ రంగాలపై జరిగిన చర్చలో రిటైర్డ్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటానారయణ, పింగిలి సంపత్ రెడ్డి, ప్రొఫెసర్లు, తెలంగాణ ఉద్యమకారులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోదండరామ్ మాట్లాడుతూ తెలంగాణ కోసం ఉద్యమించిన వాళ్లంతా.. సీఎం కేసీఆర్ దృష్టిలో ద్రోహులుగా మారారని అన్నారు. ఇంజనీరింగ్ నిపుణులు, అధికారులు కాళేశ్వరం ప్రాజెక్టు పనికి రాదని చెప్పిన లక్ష కోట్లు వృధాగా ఖర్చు చేసి ప్రజాధనం దుర్వినియోగం చేశారని ఆరోపించారు. పేద, మధ్య తరగతి ప్రజలు తమ పిల్లలను చదివించుకునేందుకు సంక్షేమ హాస్టళ్లకు పంపితే.. పాడె కట్టి పంపిస్తున్నారని మండిపడ్డారు. ఇదిలావుంటే కల్వకుంట్ల కుటుంబంలో పుట్టి రాష్ట్ర ప్రజల గోస వింటున్నందుకు తనకు చాలా బాధగా ఉందని సీఎం కేసీఆర్ అన్న కూతురు రమ్యారావు అన్నారు. 'కేసీఆర్ పరిపాలనతో చాలామంది కల్వకుంట్ల వంశాన్ని తిడుతున్నారు. ఎవరూ కల్వకుంట్ల వంశాన్ని తిట్టొద్దు. తిట్టాలనుకుంటే కేసీఆర్ కుటుంబాన్ని మాత్రమే తిట్టుకోండి' అని అన్నారు. పోలీసులు, ఉద్యోగులు ఎందుకొచ్చిన తెలంగాణ అని ఆవేదన చెందుతున్నారని అన్నారు. హన్మకొండలో నిర్వహించిన తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి హాజరైన రమ్యారావు.. ఇది ఆత్మీయ సమ్మేళనం కాదు.. తెలంగాణ ఆవేదన సమావేశం అన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రొఫెసర్ కోదండ రామ్ అప్పుడు కోకిల అయిందు.. ఇప్పుడు కాకి అయ్యిండా...? అని రమ్యారావు ప్రశ్నించారు. తెలంగాణ ఒక్కడి వల్లే రాలేదని, ఉద్యమం చేసినట్టే ఆకాంక్షల కోసం కొట్లాడే వారి వెంట నడిచేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. రాష్ట్ర ఆకాంక్షల కోసం మరో ఉద్యమం చేయాలంటూ కోదండ రామ్ కు విజ్ఞప్తి చేశారు. మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత కంటే ముందే జెండా పట్టి తెలంగాణ రాష్ట్రం కోసం కొట్లాడినం అని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు వద్దకు వెళ్దామని, పోలీసులు ఎలా అడ్డుకుంటారో చూద్దామన్నారు. మేధావులు మౌనంగా ఉండటం వల్ల తెలంగాణకు నష్టం జరుగుతుందన్నారు. గతంలో కేసీఆర్ అన్నట్టుగా టీఆర్ఎస్ పార్టీని కాంగ్రెస్ లో విలీనం చేస్తే రాష్ట్రంలో ఈ పరిస్థితి ఉండేది కాదని చెప్పారు.


# సెంట్రల్ వర్సిటీలో విద్యార్థుల ఆందోళన



**హైదరాబాద్, సెప్టెంబర్ 24 (సమ సమాజం):** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో విద్యార్థులు ఆందోళనకు దిగారు. కామన్ ఎంట్రన్స్ టేస్ట్ క్వాలిఫై అయిన విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారంటూ విద్యార్థులు ధర్నా చేపట్టారు. ధర్నాకు దిగిన విద్యార్థులను యూనివర్సిటీ సేక్యురిటీ సిబ్బంది బలవంతంగా ఖాళీ చేయించారు. ఈ క్రమంలో సెక్యూరిటీ సిబ్బంది తోపులాటలో పలువురు విద్యార్థులకు గాయాలయ్యాయి. 1,57,000 మంది విద్యార్థులు నుంచి రూ.600 అధికంగా వసులు చేశారని యునివర్సిటీ విద్యార్థుల ఆందోళన చేపట్టారు. విద్యార్థుల నుంచి వసూలు చేసిన డబ్బులను తిరిగి ఇచ్చేంత వరకు ఆందోళన కొనసాగిస్తామని వారు హెచ్చరించారు.

# పంటలసాగు వివరాలు లేకపోతే ఎలా !

అధికారుల తీరుపై మండిపడ్డ హరీష్ రావు



**జహీరాబాద్, సెప్టెంబర్ 24 (సమ సమాజం):** వ్యవసాయ శాఖ అధికారుల వద్ద పంటల సాగు వివరాలు లేకపోవడంతో రాష్ట్ర వైద్య ఆరోగ్య, ఆర్థిక శాఖల మంత్రి హరీశ్ రావు వ్యవసాయ శాఖ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు క్లస్టర్ వారిగా అధికారులను నియమించినా ఎందుకు పనిచేయడం లేదన్నారు. పనితీరు మార్చుకోవాలని సూచించారు. గర్భిణీలకు, బాలింతలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందికి, అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. మైనార్టీ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యే మాణిక్యరావు, జిల్లా కలెక్టర్ శరత్, ఉమ్మడి జిల్లా డీసీఎం చైర్మన్ శివకుమార్ తదితరులు ఉన్నారు.

# ప్రైవేట్ ఆస్పత్రుల్లో తనిఖీలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 24 (సమ సమాజం):** తెలంగాణ వ్యాప్తంగా ఆస్పత్రుల్లో అధికారులు తనిఖీలు నిర్వహించారు. నల్లగొండలో 6 ఆస్పత్రులకు షోకాజ్ నోటీసులు అందజేశారు. 5 ల్యాబ్‌లు, ఒక ప్రైవేట్ ఆస్పత్రిని సీజ్ చేశారు. ఆదిలాబాద్‌లోనూ 3 ఆస్పత్రులకు నోటీసులు అందజేశారు. వరంగల్ , నారాయణపేట్ జిల్లాలో ఆస్పత్రుల్లో తనిఖీలు నిర్వహించారు. జగిత్యాల జిల్లాలో 2 ప్రైవేట్ ఆస్పత్రులకు నోటీసులు అందజేశారు. ములుగు (లో 3 ప్రైవేట్ ఆస్పత్రులకు షోకాజ్ నోటీసులు అందజేశారు.

# నకిలీ ఆధార్ కార్డులకు చెక్




(మొదటి పేజి తరువాయి) సంవత్సరాలు పైబడిన వారి ఆధార్ నమోదు ప్రక్రియ 100శాతం పూర్తయిందని డిపార్ట్ మెంట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ కమ్యూనికేషన్ అధికారులు తెలిపారు. దేశ వ్యాప్తంగా 134 కోట్ల ఆధార్ రిజిస్ట్రేషన్లు జరిగాయని వీరిలో అందరూ వయోజనులేనని పేర్కొంది. 8 ఏళ్లు పైబడిన వారి ఆధార్ నమోదు పూర్తవ్వడంతో.. 5 సంవత్సరాలకు పైబడిన వారు కొత్తగా ఆధార్ కార్డు పొందేందుకు నిబంధనల్లో మార్పులు చేస్తోంది. గతంలో ఏ ఆధార్ కేంద్రంలో అయినా ఆధార్ కు సంబంధించిన ఎటువంటి సేవలైనా పొందే వీలుండేది. ప్రస్తుతం 5 ఏళ్లు పైబడిన వారు ఆధార్ నమోదు ప్రక్రియను ఎంపిక చేసిన కేంద్రాల్లో మాత్రమే చేసుకునేలా నిబంధనలు మారుస్తోంది. దీంతో అక్టోబర్1 వ తేదీ నుంచి దేశంలో ఎంపిక చేసిన కేంద్రాల్లో మాత్రమే 5 ఏళ్లకు పైబడిన వారు ఆధార్ నమోదు చేసుకోవాలి. అయితే ఆధార్ అప్ డేట్ మాత్రం అన్ని కేంద్రాల్లో చేసుకోవచ్చు. నకిలీ ఆధార్ కార్డుల ద్వారా దేశ భద్రతకు ముప్పు వాటిల్లుతుందనే కారణంతో ఈ నిర్ణయం తీసుకుంది. దేశంలో దేనికైనా గుర్తింపునకు ఆధార్ కార్డు కీలకం అయ్యింది. ఆధార్ లేనిదే పని జగరగడం లేదు. ఆధార్ కార్డు కూడా ఓ నిత్యావసర వస్తువుగా మారింది. ప్రభుత్వ సేవలు పొందాలన్నా, ప్రభుత్వ పథకాలు పొందాలన్నా, గుర్తింపు కావాలన్నా ఆధార్ కార్డు తప్పనిసరి. ప్రయివేటు సంస్థలు సైతం వ్యక్తి గుర్తింపు కోసం ప్రూఫ్ గా ఆధార్ కార్డునే అడుగుతున్నాయి. ప్రజలు కూడా దానికి అలవాటు పడ్డారు. యునిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా 2009లో ఆధార్ కార్డుల జారీ ప్రక్రియను ప్రారంభించింది. పుట్టిన పిల్లాడికి కూడా ఆధార్ కార్డును జారీ చేస్తుంది. దీని కోసం వ్యక్తి వివరాలతో దరఖాస్తు పూర్తిచేయాల్సి ఉంటుంది.

# చెత్తకుప్పలో వేసిన చిన్నారిని కాపాడిన హోంగార్డ్

**హైదరాబాద్, సెప్టెంబర్ 24 (సమ సమాజం):** చిన్నారి ప్రాణం కాపాడి ఓ ట్రాఫిక్ హోంగార్డు ఉదారతను చాటుకున్నారు. హైదరాబాద్ దిల్‌సుఖ్‌నగర్ లోని రాజీవ్ చౌక్‌లో రామకృష్ణ మలక్‌పేట ట్రాఫిక్ హోంగార్డు విధులు నిర్వహిస్తున్నారు. అయితే తాగిన మత్తులో ఓ యాచకురాలు సంవత్సరం చిన్నారిని కోణార్క్ థియేటర్ ముందున్న చెత్త బుట్టలో పడేసింది. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు హోమ్‌గార్డ్‌కు తెలియజేశారు. దీంతో హోంగార్డు రామకృష్ణ వెంటనే సంఘటనా ప్రాంతానికి పరుగులు తీశారు. ఆ చిన్నారికి సపర్యలు చేసి, చివరగా తల్లి ఒడికి చేర్చారు. హోంగార్డు రామకృష్ణ చూపిన మానవత్వానికి, చేసిన పనికి స్థానికులు అభినందనలు తెలియజేశారు.

# మదర్ డెయిరీ డైరెక్టర్ల ఎన్నికపై ఉత్కంఠ



(మొదటి పేజి తరువాయి) అయితేసారి భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రె డ్డి, బీజేపీ నేతలు రాజీకి ససేమిరా అనడంతో ఎన్నిక అనివార్యమైంది. మూడు డైరెక్టర్ల పదవులకు 14 మంది నామినేషన్లు దాఖలయ్యాయి. ఈనెల 27న డైరెక్టర్ల ఎన్నిక ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు నిర్వహించనున్నారు. డైరెక్టర్ల ఎన్నిక తదుపరి వీలైతే అదేరోజు చైర్మన్ ఎన్నిక, లేదంటే 28న నిర్వహించే అవకాశం ఉంది. అధికార పార్టీ నేతలు తమ ప్రాంతంలోని ఆశావహులకు భవిష్యత్తుకు భరో సా ఇచ్చి విరమింపజేశారు. మూడు స్థానాలకు ముగ్గురు డైరెక్టర్లను అధికార పార్టీ నుంచి బరిలో దించాలని నిర్ణయించారు. కాంగ్రెస్, బీజేపీ నేతలు పోటీకి సై అనడంతో ఎన్నిక, క్యాంపుల నిర్వహణ అనివార్యమైంది. మునుగోడు ఉప ఎన్నిక నేపథ్యంలో మదర్ డెయిరీ చైర్మన్ ఎన్నికను ఎలాంటి విభేదాలు లేకుండా ముందుకు తీసుకెళ్లాలని అధికార పార్టీ పెద్దలు నిర్ణయించారు. అధికార పార్టీ నుంచి కస్తూరి పాండు, గొల్లపల్లి రాం రెడ్డి, మందడి ప్రభాకర్‌రెడ్డి బరిలో ఉండగా కాంగ్రెస్ నుంచి బత్తుల నరేందర్‌రెడ్డి, బీజేపీ నుంచి శీలం వెంకటనర్సింహారెడ్డి నిలిచారు. విపక్ష పార్టీలకు చెందిన ఆశావహులను పోటీ నుంచి విరమింపజేసేందుకు డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి చివరి వరకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. పోటీలో ఉండాల్సిందేనని భువనగిరి ఎంపీ వెంకట్‌రెడ్డి సూచించడంతో ఎన్నికను ఎదుర్కోవడం నరేందర్‌రెడ్డికి అనివార్యమైంది. డైరెక్టర్లు, చైర్మన్ పదవికి అధికార పార్టీలో చాలా మంది పోటీ పడుతున్నారు. ఎమ్మెల్యే సైతం తమ ని యోజకవర్గానికి అంటే తమ నియోజకవర్గానికే అం టూ పోటీపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఏ మాత్రం అధికార పార్టీలో అసమ్మతి రేగినా అది తమకు కలిసొ చ్చే అవకాశం ఉంటుందన్న ఆలోచనతో కాంగ్రెస్, బీజే పీ సానుభూతిపరులు బరిలో ఉన్నట్లు సమాచారం. ఆలేరు నియోజకవర్గానికే చైర్మన్ పదవిమదర్ డెయిరీలో అత్యధిక సంఖ్యలో ఓటర్లతో పా టు పాల సేకరణ కేంద్రాలు అధికంగా ఉన్న ఆలేరు ని యోజకవర్గానికి ఈ దఫా చైర్మన్ పదవి ఇవ్వాలని టీ ఆర్ఎస్ అధిష్ఠానం నిర్ణయించినట్లు తెలిసింది. గతంలోనే ఈచైర్మన్ స్థానం కోసం డీసీసీబీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే సునీత అధిష్ఠానం వద్ద ప్రయత్నించినా నిరాశే మిగిలింది. తాజా ఎన్నికల్లో ఆలేరు నియోజకవర్గానికి చెందిన డైరెక్టర్లలో కస్తూరి పాండు లేదా గొల్లపల్లి రాంరెడ్డికి చైర్మన్‌గా అవకాశం దక్కనున్నట్లు సమాచారం. ముందుగా అధికార పార్టీకి చెందిన డైరెక్టర్లను గెలిపించుకుని, ఆ తర్వాత చైర్మన్ ఎన్నికపై దృష్టిపెట్టాలని, ముందే చైర్మన్ ఎవరనేది చర్చ ప్రారంభిస్తే చీలికలు వస్తాయని ఆపార్టీ నేతలు భావిస్తున్నారు. అయితే చైర్మన్ స్థానం ఆలేరు నియోజకవర్గానికే ఇవ్వాలని అధిష్ఠానం నిర్ణయించినా, అక్కడి నుంచి ప్రస్తుతం డైరెక్టర్లుగా కొనసాగుతున్న దొంతి సోమిరెడ్డి, కందాల అలివేలు, లింగాల శ్రీకర్‌రెడ్డి, అరకాల గాల్‌రెడ్డి ఉండగా, తాజాగా గొల్లపల్లి రాంరెడ్డి పోలింగ్‌ను ఎదుర్కొంటున్నారు. ఈ ఐదుగురిలో స్థానిక ఎమ్మెల్యే ఎవరివైపు ఉంటారనేది ఆసక్తికరంగా మారింది. మరోసారి తానే చైర్మన్ అని, అధిష్ఠానం ఆ మేరకు హామీ ఇచ్చిందంటూ తాజా మాజీ చైర్మన్ గంగుల కృష్ణారెడ్డి మొన్నటి వరకు ప్రచారం చేసుకున్నారు. అయితే ఆయనకు చివరి నిమిషంలో అధికార పార్టీ నుంచే చుక్కెదురైంది. నకిరేకల్ ఎమ్మెల్యే విముఖత చూపడంతో ఆయన పోటీ నుంచి తప్పుకోవాల్సి వచ్చిందని కృష్ణారెడ్డి తన అనుచరుల వద్ద వ్యాఖ్యానించినట్లు తెలిసింది. మరోసారి పదవికోసం గుత్తా జితేందర్‌రెడ్డి ప్రయత్నించినా ఆలేరుకు కేటాయించనుండటంతో ఆయన తప్పుకున్నారు. డైరెక్టర్ల ఎన్నిక ఈనెల 27న ఉండగా, పోటీ తప్పని పరిస్థితి నెలకొనడంతో ఓటర్లను క్యాంపునకు తరలించేందుకు అధికార టీఆర్ఎస్ నేతలు ఏర్పాట్లు ప్రారంభించారు. మదర్ డెయిరీలో మొత్తం 286 మంది ఓటర్లు ఉండగా, మూడు డైరెక్టర్ల స్థానాలకు ఖాళీలు ఏర్పడడంతో ప్రతీ ఓటరు మూడు ఓట్లు వేయాల్సి ఉంటుంది. డైరెక్టర్లు, చైర్మన్ ఎన్నిక బాధ్యతను టీఆర్ఎస్ అధిష్ఠానం గొంగిడి మహేందర్‌రెడ్డికి అప్పగించడంతో నామినేషన్ల మొదలు ఈనెల 23న పోటీదారుల విరమణ, క్యాంపు ఏర్పాట్లను చూస్తూ ఆయన మదర్ డెయిరీ కేంద్రంలోనే ఉన్నారు. ఆయనతో పాటు మాజీ చైర్మన్ గంగుల కృష్ణారెడ్డి సైతం ఉన్నారు.

# ఉత్తరాదిని కుదిపేస్తున్న భారీ వర్షాలు



(మొదటి పేజి తరువాయి) చేరడంతో.. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఢిల్లీలోనూ వరద ప్రభావం కనిపిస్తోంది. ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో భారీగా ట్రాఫిక్ జాం అయ్యింది. ఎక్స్ ప్రెస్ వేలో వరద నిలిచిపోయింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు హర్యానాలో కూడా భారీగా వానలు పడుతున్నాయి. అంతేకాదు వచ్చే రెండ్రోజుల పాటు భారీగా వర్షాలు పడతాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. హర్యానాలో రోడ్లన్నీ చెరువులను తలపిస్తున్నాయి. మోకాలి లోతు నీటిలోనే ప్రజలు జీవనం సాగిస్తున్నారు. చాలా ప్రాంతాల్లో వాహన రాకపోకలు నిలిచిపోయాయి. పలు కాలనీలు జలదిగ్బంధమయ్యాయి. వరదల వల్ల హైవేలపై భారీగా ట్రాఫిక్ జాం అవుతోందని అధికారులు తెలిపారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో వర్షం పడటంతో.. రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ధాన్యం తడిచిపోయిందని ఆవేదన చెందుతున్నారు. ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాల వల్ల కొండచరియలు విరిగిపడుతున్నాయి. తాజాగా కైలాస మానససరోవరం యాత్రకు వెళ్లే రహదారిలో కొండ చరియలు విరిగిపడడంతో యాత్రికులు నిలిచిపోయారు. తవాఘాట్ జాతీయ రహదారి వద్ద సుమారు 40 మంది యాత్రికులు ఆగిపోయినట్లు అధికారులు వెల్లడించారు. నజాంగ్ తంబా గ్రామం వద్ద శుక్రవారం సాయంత్రం కొండచరియలు విరిగిపడ్డాయి. భారీ వర్షాల వల్ల ఉత్తరాఖండ్‌లో ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. చాలాచోట్ల రహదారులు స్తంభించిపోయాయి. రిషికేశ్-గంగోత్రి జాతీయ రహదారి కూడా బండ రాళ్లతో బ్లాక్ అయ్యింది. ప్రస్తుతం దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.

# ప్రధాని మోడీ హత్యకు పిపిఎఫ్ కుట్ర



(మొదటి పేజి తరువాయి) కార్యకలాపాలపై ఈడీ దృష్టి సారించింది. దేశవ్యాప్తంగా 11 రాష్ట్రాల్లోని పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా కార్యాలయాలపై ఈవారంలో జాతీయ దర్యాప్తు సంస్థ దాడులు చేసింది. పిపిఎఫ్ జాతీయ కార్యదర్శి నస్సరుదీన్ ఎలమారం సహా వంద మందికి పైగా నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేసింది. వీరిలో కేరళ నుంచి 22 మందిని, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి చెరో 20 మందిని, తమిళనాడు నుంచి 10 మందిని, అస్సాం నుంచి తొమ్మిది మందిని, ఉత్తరప్రదేశ్ నుంచి ఎనిమిది మందిని అధికారులు అరెస్టు చేశారు. తెలంగాణలోని హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ లోని గుంటూరు, కర్నూలు తదితర ప్రాంతాల్లో ఎన్ఐఎ దాడులు నిర్వహించి, పలువురిని అదుపులోకి తీసుకుంది. ఉగ్రవాదులకు నిధులు సమకూర్చడం, మనీలాండరింగ్ సహా వివిధ ఆరోపణలతో ఈ అరెస్టులు జరిగాయి. మనీలాండరింగ్ ఆరోపణలతో ఎన్ఐఎ కేసులు నమోదు చేసిన వెంటనే వీటిపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడి) దర్యాప్తు ప్రారంభించింది. మరోవైపు దేశంలో ఎన్ఐఎ అధికారుల దాడులను నిరసిస్తూ కేరళలో బంద్ కూడా నిర్వహించారు. కేరళలో పీఎఫ్ఐ నిర్వహించిన బంద్ లో హింసాత్మక సంఘటనలు చోటుచేసుకున్న విషయం తెలిసిందే. కేరళలో ఆర్ టీసీ బస్సులు, పలు ప్రైవేట్ వాహనాలు ధ్వంసం కావడంతో పాటు అనేక మంది సామాన్య ప్రజలకు తీవ్రగాయాలయ్యాయి. ఎన్ ఐఎ అధికారులు అదుపులోకి తీసుకున్న పిపిఎఫ్ నాయకులను విచారిస్తున్న సమయంలో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వస్తున్నాయి. ఏకంగా దేశ ప్రధానమంత్రి నరేంద్రమోదీ హత్యకు వారు ప్లాన్ చేసినట్లు తేలడం ఇప్పుడు దేశ వ్యాప్తంగా కలకలం సృష్టిస్తోంది. ఇంకా దేశంలో ఎటువంటి విధ్వంసాలకు పీఎఫ్ ఐ ప్లాన్ చేసిందనే కోణంలోనూ ఎన్ ఐఎ అధికారులు దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే పీఎఫ్ ఐ నాయకుల విచారణలో ఎన్నో కుట్ర కోణాలు బయట పడినట్లు సమాచారం.

# మొండి బకాయిలపై బ్యాంకుల నిర్లక్ష్యం

(మొదటి పేజి తరువాయి) విధిస్తున్న ఛార్జీలు చూస్తే బ్యాంక్ ఖాతా లేకపోవడమే ఉత్తతమని భావిస్తున్నారు. మరోవైపు పాతబకాయిల వసూలుకు సంబంధించి నిర్దుష్ట విధానం అవలంబించడం లేదు. మొండి బకాయిదారుల పేర్లను వెల్లడించాలని గతంలో సుప్రీం ఆదేశించిన ఎందుకనో ఆర్‌బిఐ ముందుకు రావడం లేదు. మొత్తంగా మొండిబకాయిల దెబ్బకు బ్యాంకుల నడ్డి విరుగుతోంది. దేశంలోని 50 అతిపెద్ద రుణ ఖాతాల మొండి బాకీల వల్ల వివిధ బ్యాంకులు దాదాపుగా రూ.2.4 లక్షల కోట్లు వదులుకోవాల్సిన పరిస్థితి నెలకొందని ప్రముఖ రేటింగ్ ఏజెన్సీ క్రిసిల్ గతంలోనే విశ్లేషించింది. ఈ నివేదిక ప్రకారం యాభై కంపెనీలకు ఇచ్చిన అప్పుల్లో మొండి బాకీలుగా మారిన మొత్తంలో 60 శాతం మేర రద్దు చేసుకోవాల్సిన దుస్తితి నెలకొంది. వీటి మొండిబకాయిలు రూ.4 లక్షల కోట్ల మేర ఉన్నాయి. 50 కంపెనీల్లో 30 శాతం అప్పులు మెటల్ రంగానివే అని గుర్తించారు. నిర్మాణ రంగం 25 శాతం, విద్యుత్ 15 శాతం చొప్పున బ్యాంకులకు నిరర్ధక ఆస్తులను మిగిల్చాయి. 2017 మార్చి 31 నాటికి బ్యాంకుల మొత్తం మొండి బాకీలు రూ.8 లక్షల కోట్లలో ఈ 50 కంపెనీల వాటా దాదాపుగా సగం మేర ఉన్నాయి. మొత్తం నిరర్థక ఆస్తుల్లో కనీసం సగానికి పైగా రుణాలు ఈ రంగాలివే. భారత జిడిపిలో ఇవి 5 శాతం. ఆర్థిక విలువ ఆధారితంగా ఈ రైటాఫ్ విలువను లెక్కించామని క్రిసిల్ రేటింగ్స్ చీఫ్ వెల్లడించారు. చివరిగా తీసుకునే రైటాఫ్ విలువ, బ్యాంకుల అంచనాలు, సబ్సిడరీల వాల్యుయేషన్, కమోడిటీతో మిళితమయ్యే రంగాల ధరల అవుట్‌లుక్‌తో ప్రభావితమై ఉంటుందని క్రిసిల్ వివరించింది. ఈ కంపెనీలన్నీ వ్యాపారంలో సమగ్రత కలిగిలేవని పేర్కొన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముఖగా ఉన్న బ్యాంకింగ్ రంగంలో నూతన విధానాలు అమలు చేయడంలో ఆలస్యం వల్ల బ్యాంకులు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. నిర్వహణ వ్యయం పెరగడం, ప్రాజెక్టులకు తగు సమయంలో అనుమతులు లభించకపోవడం తదితర పరిణామాలు కంపెనీల చెల్లింపులపై ఒత్తిడిని పెంచాయి. ఇప్పటికే బ్యాంకులు మొండి బాకీల కింద కేటాయింపులు చేశాయని క్రిసిల్ రిపోర్టులో పేర్కొంది. తాజాగా మరో 20 శాతం పెంచాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ నష్టాలను తట్టుకోవడానికి బ్యాంకులకు సరిపడ మూలధనం అవసరం ఉంటుంది. కొత్త నిధులు లభిస్తేనే రుణాల మంజూరులో వృద్ధికి దోహదం చేయనుంది. లేనిచో బలహీన వృద్ధికి కారణం కానుంది.

# బతుకమ్మ ఉత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు

(మొదటి పేజి తరువాయి) కార్యక్రమంలో బతుకమ్మ చీరల పంపిణీ ప్రారంభించారు. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు, ఆడపడుచుల ఔన్నత్యానికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగను రాష్ట్ర ప్రజలందరూ సంతోషంగా జరుపుకోవాలని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు నిదర్శనంగా భావించే బతుకమ్మ పండుగ సందర్భంగా ఆడ బిడ్డల కోసం సీఎం కేసీఆర్ ప్రతి ఏడాది కోట్ల వ్యయంతో ఈ ఉత్సవాలు ఘనంగా జరిపిస్తున్నారు. ఈ ఏడాది రూ. 340 కోట్ల వ్యయంతో ఒక కోటి 18 లక్షల చీరలను ప్రభుత్వం పంపిణీ చేస్తుంది. బతుకమ్మ చీరల తయారీలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా వేల మంది చేనేత కార్మికులు ఉపాధి పొందారు. రంగు రంగుల వన్నెల్లో, కలర్ ఫుల్ రంగులతో సిరిసిల్ల, పోచంపల్లి, గద్వాల్ తదితర ప్రాంతాల్లో నేతన్నలతో నేయించి రాష్ట్రంలో అన్ని ప్రాంతాల్లో మహిళా లబ్దిదారులకు భారీగా పంపిణీ చేస్తున్నారు. ఈ సంవత్సరం బతుకమ్మ చీరలు మరింత ఆకర్షణీయంగా వెండి, బంగారు, జరీ అంచులతో తయారు చేయించారు. ముఖ్యమంత్రి ఆకాంక్ష మేరకు ప్రభుత్వం, తెలంగాణ రాష్ట్ర అవతరణ అనంతరం ప్రతి బతుకమ్మ పండుగకు తెలంగాణ ఆడబిడ్డలకు రంగు రంగుల డిజైన్లలో చీరలు ఉచితంగా అందిస్తోంది. గత ఆరు సంవత్సరాలుగా రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు చీరలను ఉచితంగా పంపిణీచేస్తుంది. నేత కార్మికులకు ఉపాధి కల్పించడం, మహిళలకు పండుగ కానుక అందించడమే లక్ష్యంగా ప్రతి ఏడాది చీరలను ప్రభుత్వం అందజేస్తోంది. కాగా, తెల్ల రేషన్ కార్డు కలిగిన ప్రతీ ఆడబిడ్డకు కొత్త చీరను కానుకగా అందజేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. దీన్ని ఒక శుభకార్యంగా భావించి ఏటా ప్రభుత్వం 18 ఏళ్లు దాటిన ఆడపడుచులకు చీరలను కానుకగా అందజేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం సిరిసిల్ల, పోచంపల్లి, గద్వాల, పెద్దపల్లి, కరీంనగర్, జగిత్యాల చేనేత కార్మికులతో మరమగ్గాలపై ప్రత్యేకంగా తయారు చేయించింది. ఈ చీరల్లో వైవిధ్యం ఉట్టిపడేలా ఈ సారి కొత్త రంగుల్లో నేయించారు. అంతే గాకుండా ప్రతి చీరల్లోనూ బ్లౌజు కూడా ఉంటుంది. అందరికీ ఒకే రకమైన చీరలు కాకుండా జీహెచ్ఎంసీ, పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో వార్డుల వారిగా, విభిన్నంగా రంగులు, డిజైన్ల చీరలను పంపిణీ చేస్తున్నారు. ఈ బతుకమ్మ చీరలు తెల్లరేషన్ కార్డుదారులకే అందజేస్తున్నారు. ఇందులో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిల్లోనే సుమారు 10.46 లక్షల తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయి.




గత సంవత్సరం 26 డిజైన్లతో బతుకమ్మ చీరలను టెస్కో అధికారలను తయారు చేయించగా ఈ సంవత్సరం 240 పై చిలుకు వెరైటీ డిజైన్లను బతుకమ్మ చీరల తయారీలో వినియోగించారు. ఈ సంవత్సరం వెండి, బంగారు, జరీలతో పాటు డాబి, జాకాడ్ అంచుల డిజైన్లతో చీరల పంపిణీకు జౌళిశాఖ సిద్ధం చేసింది. ఉమ్మడి ఆదిలాబాద్, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా మహిళల కోసం 9 గజాల చీరలను ప్రత్యేకంగా 8 లక్షల చీరలను ప్రభుత్వం రూపొందించింది. రాష్ట్ర వ్యాప్తంగా బతుకమ్మ చీరల పంపిణీ ముమ్మరంగా కొనసాగుతుంది.

# ఇబ్రహీంపట్నం ఆపరేషన్ల ఘటపై చర్యలు



(మొదటి పేజి తరువాయి) జారీ చేసింది. ఆగస్టు 25న ఇబ్రహీంపట్నంలో 34 మంది మహిళకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేశారు. అయితే శస్త్రచికిత్స వికటించి నలుగురు మహిళలు మృతిచెందారు. ఈ ఘటపై ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ ఆధ్వర్యంలో విచారణ కమిటీని నియమించింది. ఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కమిటీ సిఫారసు చేసింది. దీంతో బాధ్యులపై ప్రభుత్వం క్రమశిక్షణ చర్యలు తీసుకున్నది. ప్రభుత్వం చర్యలు తీసుకున్న వారిలో ఇబ్రహీంపట్నం దవాఖానకు సంబంధించిన డీపీఎల్ క్యాంపు ఆఫీసర్ డాక్టర్ నాగజ్యోతి, డిప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ గీత, హెడ్ నర్స్ చంద్రకళతోపాటు మాడుగుల పీహెచ్‌సీ డాక్టర్ శ్రీనివాస్, సూపర్ వైజర్లు అలివేలు, మంగమ్మ, మంచాల పీహెచ్‌సీ డాక్టర్ కిరణ్, సూపర్‌వైజర్ జయలత, దండుమైలారం పీహెచ్‌సీ డాక్టర్ పూనం, సూపర్‌వైజర్ జానకమ్మ ఉన్నారు. ఇక జిల్లా హాస్పిటళ్ల వైద్య సేవల కోర్డినేటర్ (డీసీహెచ్ఎస్) ఝాన్సీ లక్ష్మిని బదిలీ చేసిన అరోగ్య శాఖ, షాద్‌నగర్ దవాఖానలో రిపోర్ట్ చేయాలని ఆదేశించింది. ఆమెపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని సూచించింది. కొండాపూర్ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వరదాచారికి రంగారెడ్డి డీసీహెచ్ఎస్‌గా అదనపు బాధ్యతలు అప్పగించింది. ఇప్పటికే సస్పెండ్ అయిన ఇబ్రహీంపట్నం దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్‌పై కూడా క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసిన డాక్టర్ జోయల్ సునీల్ కుమార్ మీద క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఆదేశాలు జారీచేసింది. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల నిర్వహణ విషయంలో మార్గదర్శకాలు జారీ చేసింది. అన్ని టీచింగ్ ఆసుపత్రులు, వైద్య విధాన పరిషత్ హాస్పిటళ్లు, ప్రైమరీ హెల్త్ కేర్ సెంటర్లు వీటిని పాటించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నది. ఇకముందు ఆసుపత్రుల సేవల్లో భాగంగా కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయాలి. కు.ని ఆపరేషన్లు నిర్ణయించిన రోజుల్లో మాత్రమే చేయాలి. ఆపరేషన్ తర్వాత 24 గంటల పాటు విధిగా అబ్జర్వేషన్‌లో ఉంచాలి. ముందుగా నిర్ణయించిన క్యాలెండర్ ప్రకారం, ఆపరేషన్ చేసుకునే వారు, వారికి ఇష్టం ఉన్న రోజుల్లో రావొచ్చు. డిశ్చార్జ్ అయి ఇంటికి వెళ్ళిన పేషెంట్‌ను సంబంధిత ఆసుపత్రి సూపర్ వైజర్ 24 గంటల్లోగా ఒకసారి, వారంలోగా మరో రెండు సార్లు వెళ్లి ఆరోగ్య పరిస్థితి తెలుసుకోవాలి. సంబంధిత పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ కూడా వారి పరిధిలోని ఆపరేషన్ చేసుకున్న వారందరినీ రెండు రోజుల్లోగా వెళ్లి పరిశీలించాలి. పేషెంట్ సంబంధిత సూపర్ వైజర్ పేషెంట్లను మానిటర్ చేస్తున్నారా లేదా మెడికల్ ఆఫీసర్ చూసుకోవాలి. ప్రీ ఆపరేటివ్, ఇంట్రా ఆపరేటివ్, పోస్ట్ ఆపరేటివ్ ప్రమాణాలు పాటించేలా ఆసుపత్రి సూపరింటెండెంట్, సర్జన్, డీపీఎల్ క్యాంపు ఆఫీసర్ చూసుకోవాలి. ఆపరేషన్ల తర్వాత తలెత్తే సమస్యలను గుర్తుపట్టే విధంగా సూపర్ వైజర్లకు ఎప్పటికపుడు శిక్షణ తరగతులు నిర్వహించాలి. దాదికి ఒకసారి డీపీల్ సర్జన్ల నైపుణ్యతను అంచనా వేసే విధంగా ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలి. కమిషనర్ ఆఫీసులోని రాష్ట్ర స్థాయి జాయింట్ డైరెక్టర్ మూడు నెలలకు ఒకసారి స్టెరిలైజేషన్ మీద కు.ని నిర్వహణ అధికారులు, సర్జన్లు, ఇతర సిబ్బందితో సమీక్ష జరపాలి. నాణ్యత ప్రమాణాలను అనుసరించి ఒకరోజు ఒక ఆసుపత్రిలో 30కి మించి ఆపరేషన్లు చేయరాదు. ఆయా ఆసుపత్రుల్లో ఇన్ఫెక్షన్ కంట్రోల్ కమిటీ ఛైర్మన్‌గా ఉన్న సూపరింటెండెంట్లు ప్రతి సోమవారం ఇన్ఫెక్షన్ నివారణ, నియంత్రణ మీద సమీక్ష చేయాలి. ÷రిళిధన ఆసుపత్రులు, టీవీవీపీ ఆసుపత్రుల్లోని ఇన్ఫెక్షన్ కంట్రోల్ ఆఫీసర్లు, నర్సులకు ఇన్ఫెక్షన్ కంట్రోల్ నూతన పద్ధతులపై ఎప్పటికప్పుడు నిమ్స్ ఆసుపత్రిలో శిక్షణ ఇవ్వాలి. ఇన్ఫెక్షన్ నివారణ ప్రమాణాలు పాటించే విధంగా డీఎమ్ఈ, టీవీవీపీ కమిషనర్ చూసుకోవాలి, ముఖ్యంగా ఆపరేషన్ థియేటర్లు, ఐసీయూల్లో ప్రత్యేక దృష్టి సారించాలి.

# సంక్షేమ హాస్టళ్లలో మంత్రి తనిఖీలు

## భోజన,వసతి సౌకర్యాలపై ఆరా

**నిర్మల్, సెప్టెంబర్ 24 (సమ సమాజం):** సాంఘిక సంక్షేమ గురుకులాల్లో సౌకర్యాలు ఎలా ఉన్నాయో తెలుసు కునేందుకు మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి బడిబాట పట్టారు. సారంగాపూర్ మండలం జాం గ్రామంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల రెసిడెన్షియల్ స్కూల్, వసతి గృహాలను మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి శనివారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. రెసిడెన్షియల్ స్కూల్‌లో వంట గది, భోజన శాల, వసతి ఇలా అన్ని విభాగాలను నిశితంగా పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజన వివరాలను, మెనును అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు నాణ్యమైన విద్య, భోజనం అందించాలని నిర్వాహకులకు సూచించారు. ఇటీవల ఆహారం కలుషితమై విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్న ఘటనల నేపథ్యంలో వంట గదిలో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. తాజా కూరగాయాలను వండాలని, బియ్యం, గుడ్లు, ఇతర వంట సామాగ్రి ఎక్కువ కాలం నిల్వ ఉంచరాదని ఆదేశించారు. ఈ సందర్భంగా విద్యార్థినిలతో ఆయన మాట్లాడారు. అల్పాహారం, భోజనం రుచికరంగా ఉంటోందా? అన్ని వసతులు అందుబాటులో ఉన్నాయా.. అని ఆరా తీశారు. అనంతరం విద్యార్థులతో కలిసి మంత్రి భోజనం చేశారు.

# ఎలక్ట్రానిక్ వస్తువుల పేరుతో ఏడున్నర లక్షలు లూటీ

**కామారెడ్డి, సెప్టెంబర్ 24 (సమ సమాజం):** కామారెడ్డి జిల్లాలో జరిగిన సైబర్ మోసం ఒకటి తాజాగా వెలుగు చూసింది. బీబీపేట మండల కేంద్రానికి చెందిన కల్ల లచ్చయ్యకు ఈ నెల 9న సైబర్ నేరగాళ్ల నుంచి ఫోన్ కాల్ వచ్చింది. దుబాయ్ నుంచి కొన్ని ఎలక్ట్రానిక్ వస్తువులు పంపిస్తున్నామంటూ సైబర్ నేరగాళ్లు అతనికి ఫోన్ చేశారు. డబ్బులు చెల్లించాలంటూ సూచించగా విడతల వారీగా ఆన్‌లైన్ అకౌంట్ ద్వారా లచ్చయ్య డబ్బులు చెల్లించాడు. పార్శిల్ ఢిల్లీకి వచ్చిందని మరోసారి చెప్పడంతో లచ్చయ్య డబ్బులు అకౌంట్‌లో జమ చేశాడు. మొత్తం కలిపి 7,50,000 రూపాయలను సైబర్ నేరగాళ్లకు లచ్చయ్య పంపించారు. తిరిగి ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ రావడంతో స్థానిక బీబీపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# ఆత్మసంతృప్తిని మించిన ఆనందం లేదు!

## (ఆధ్యాత్మిక చింతన )

**తిరుమల, సెప్టెంబర్ 24 (సమ సమాజం):** యవ్వనంలో ఉంటే ముసలితనం వచ్చేస్తుందని భయపడతాం. ధనవంతులమైతే అనుకోకుండా పేదవాళ్లమైపోతామేమో అని భయపడతాం. ఏ స్థితిలోనూ భయం కలిగించనిది ఒకే ఒక్కటి. అదే వైరాగ్యం. 'నాకు అక్కర్లేదు!' అనుకునే వాడు ఉన్నంత నిర్భయంగా మరెవ్వడూ ఉండడు. 'నాకిది కావాలి!' అనుకుంటే వంద రకాల తాపత్రయాలు పడాల్సిందే. శివుడు మన్మథుని గర్వాన్ని నిర్మూలనం చేశాడు. మనం కూడా శివ భక్తులమై సంసారంలో ఉంటూనే కామవాంఛలను జయించాలి. అది గ్రహిస్తే యాభై ఏళ్లు దాటే సరికి కాస్త నెమ్మదిగా వైరాగ్య మార్గంలో పడతాం. అప్పుడు నిర్భయంగా ఉండగలుగుతాం. జీవితంలో ఏదైనా భయం కలిగించేదే. పాండిత్యం సంపాదిస్తే, అంతకన్నా ఎక్కువ పాండిత్యం ఉన్న వాడు వస్తాడని భయపడతాం. అందంగా ఉంటే ఈ అందం దెబ్బతింటుందేమోనని భయపడతాం. ఆ గర్వాన్ని జయించాలంటే పార్వతీపరమేశ్వరులిద్దరినీ మనం ఆశ్రయించాలి. నారదుడు మొదలుకుని ముఖ్యమైన మునులందరూ నిరంతరం భగవంతుని ధ్యానంలో గడిపారు. వారి మనః పద్మాలలో శివుడు తుమ్మెదలా విహరిస్తున్నాడు. మనమూ అలా నిరంతరం భగవంతుని ధ్యానంలో గడుపుదాం. మనస్సులో భక్తి తప్ప మరేమీ ఉండకూడదు. 'అంతా నువ్వే!' అని భగవంతుణ్ణి వేడుకోవాలి. దేశం బాగుపడటానికి, జీవితం బాగుపడటానికి ఆధ్యాత్మికతను మించిన మార్గం లేదు. శంకరాచార్యుల నుంచి వివేకానందుల వరకు ఇదే ఆచరించి చూపారు. కావాలను కుంటేనే సమస్యలు వచ్చి పడతాయి. అందువల్ల తాహతుకు మంచి కోరికలను కోరుకుంటే సమస్యలు చుట్టుముడతాయి.




# చలన చిత్రం



## పొన్నియన్ సెల్వన్‌పై భారీ అంచనాలు


### తెలుగులో విడుదల చేస్తున్న దిల్‌రాజు

విక్రమ్, ఐశ్వర్యారాయ్, కార్తి, త్రిష లాంటి స్టార్ కాస్ట్‌తో మణిరత్నం తీసిన 'పొన్నియిన్ సెల్వన్' ఫస్ట్ పార్ట్ సెప్టెంబర్ 30న అన్ని భాషల్లో విడుదలవుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో విక్రమ్ మాట్లాడుతూ 'మణిరత్నం నా డ్రీమ్ డైరెక్టర్. అందుకే ఇందులో గుర్రంపై వచ్చే సీన్ ఒక్కటి చేస్తే చాలనుకున్నా. అలాంటిది మంచి రోల్ దక్కింది. ఇంతమంది స్టార్స్ కలిసి నటించడం రికార్డ్' అన్నాడు. తెలుగులో రిలీజ్ చేస్తున్న దిల్ రాజు మాట్లాడుతూ 'ఒక్క హీరోతో సినిమా తీయాలంటేనే చుక్కలు కనిపిస్తున్నాయి. అలాంటిది ఇంతమందిని పెట్టి నూట యాభై రోజుల్లో రెండు పార్టులుగా తీయడం చాలా గొప్ప విషయం. సినిమాకి భాషలతో సంబంధం లేదు. ఇప్పుడంతా ఇండియన్ సినిమానే. పొన్నియిన్ సెల్వన్ ఇండియా అంతటా అద్భుతం సృష్టిస్తుంది' అన్నారు. జయం రవి మాట్లాడుతూ 'ఇక్కడ పుట్టకపోయినా నేను పెరిగిందంతా హైదరాబాద్‌లోనే. ఇలాంటి అద్భుతమైన సినిమాలు మళ్లీ మళ్లీ రావు' అన్నాడు. కార్తి మాట్లాడుతూ 'ఇండియాలో తెలుసుకోవాల్సిన కథలెన్నో ఉన్నాయి. వాటిలో ఇదొకటి. సీనియర్ ఎన్టీఆర్ గారిని దృష్టిలో పెట్టుకుని నేను డైలాగ్స్ చెప్పాను' అన్నాడు. సుహాసినీ మణిరత్నం మాట్లాడుతూ 'మా పెళ్లి కంటే ముందే మణి ఈ కథ నాకు చెప్పారు. ముప్పై నాలుగేళ్ల తర్వాత సినిమాగా వస్తోంది. దీనికి కారణమైన సుభాస్కరన్ గారికి థ్యాంక్స్. ఒరిజినల్ స్టోరీ తమిళనాడుదే అయినా ఆంధ్ర, తెలంగాణల్లోనే షూటింగ్ జరిగింది. అందుకే ఇది తెలుగు సినిమా' అన్నారు. చాలా రోజుల తర్వాత తెలుగు ప్రేక్షకుల్ని కలవడం ఆనందంగా ఉందంది త్రిష. 'ఈ సినిమా చూశాక నెట్‌ఫ్లిక్స్, అమెజాన్ లాంటి ఓటీటీల్లో విదేశీ కంటెంట్ చూడటం మానేశా. ఎందుకంటే వాటన్నింటిలో లేని మన కల్చర్, మనకు తెలిసిన ముఖాలు ఇందులో ఉన్నాయి' అన్నారు రెహమాన్. తాను ఈవెంట్‌కు రాకపోయినా తన మనసు ఇక్కడే ఉందంటూ వీడియో మెసేజ్ ద్వారా చెప్పారు మణిరత్నం. ఐశ్వర్య లక్ష్మి, శరత్ కుమార్, విక్రమ్ ప్రభు, అనంత శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.



## కెప్టెన్ మిల్లర్‌గా కోటీవుడ్ నటుడు ధనుష్

తమిళ స్టార్ ధనుష్‌కు టాలీవుడ్ టైర్-2 హీరోలకున్న క్రేజ్ ఉంది. ప్రస్తుతం ఈయన తెలుగులో మార్కెట్‌ను పెంచుకునే పనిలో ఉన్నాడు. ఇటీవలే 'తిరు'తో భారీ విజయాన్ని సాధించిన ధనుష్.. అదే జోష్‌తో వరుసగా సినిమాలను సెట్స్‌పైకి తీసుకెళ్తున్నాడు. ప్రస్తుతం ధనుష్ నాలుగు సినిమాలను సెట్స్ పైన ఉంచాడు. అందులో 'కెప్టెన్ మిల్లర్' ఒకటి. పీరియాడిక్ గ్యాంగ్ స్టర్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి అరుణ్ మాతేశ్వరణ్ దర్శకత్వం వహించనున్నాడు. ఇప్పటికే ప్రీ ప్రొడక్షన్ పనులను పూర్తి చేసుకున్న ఈ చిత్రం త్వరలోనే షూటింగ్ ప్రారంభించనుంది. ఈ చిత్రం ధనుష్ కెరీర్‌లో అత్యంత భారీగా దాదాపు వంద కోట్ల బ్జడెట్‌తో తెరకెక్కనున్నట్లు సమాచారం. అంతేకాకుండా 1930-40 టైం పీరియడ్‌లో ఈ చిత్రం తెరకెక్కనుందని టాక్. ఈ చిత్రంలో టాలీవుడ్ యంగ్ హీరో సందీప్ కిషన్ కీలకపాత్ర పోషిస్తున్నాడు. ధనుష్‌కు జోడీగా ప్రియాంక అరుళ్ మోహన్ హీరోయిన్‌గా నటిస్తుంది. జీ. వి ప్రకాష్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని సత్య జోతి బ్యానర్‌పై సెంథిల్ త్యాగరాజన్, అర్జున్ త్యాగరాజన్ నిర్మిస్తున్నారు. తమిళంతో పాటు తెలుగు, హిందీ, మలయాళ, కన్నడ భాషల్లో ఈ చిత్రం రూపొందనుంది.





## కలెక్షన్లలో దూసుకుపోతున్న బ్రహ్మాస్త్ర

### సెకండ్ పార్ట్ నిర్మాణానికి సన్నాహాలు

రణబీర్ కపూర్, ఆలియా భట్ జంటగా నటించిన మూవీ బ్రహ్మాస్త్ర. ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా కలెక్షన్లతో దూసుకుపోతోంది. వరల్డ్ వైడ్ గా రూ. 400 కోట్ల మార్క్ ను క్రాస్ చేసేందుకు సిద్ధమైంది. దేశీయంగా రూ.250 కోట్లకు చేరువలో ఉంది. అయాన్ దర్శకత్వం వహించిన ఈ మూవీ సెప్టెంబర్ 9న రిలీజ్ అయ్యింది. ఈ సినిమాపై మొదటి నుంచి భారీగా అంచనాలు పెట్టుకుంది చిత్ర బృందం. వరల్డ్ వైడ్ గా రిలీజ్ అయిన బ్రహ్మాస్త్ర టాలీవుడ్ లో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయింది. నార్త్ ఇండియా, విదేశాల్లో మాత్రం మంచి ఆదరణ పొందుతోంది. కలెక్షన్ల పరంగా దూసుకుపోతోంది. ఈ సినిమాలో బాలీవుడ్ బ్యూటీ మౌని రాయ్ విలన్ గా కనిపించారు. అలాగే అమితాబ్ బచ్చన్, నాగార్జున కీలక పాత్రల్లో నటించారు. బ్రహ్మాస్త్ర మూవీ 2014 సంవత్సరం నుంచి నిర్మాణంలో ఉంది. మొత్తం చిత్ర యూనిట్ ఎన్నో త్యాగాల వల్ల ఈ సినిమా తెరకెక్కినట్లు మేకర్స్ ప్రకటించారు. అందరికంటే ఎక్కువగా రణ్‌బీర్ కపూర్ త్యాగం చాలా గొప్పది అన్నారు. ఆలియా భట్ కూడా చాలా ఏళ్లుగా తనకున్నా పూర్తి సమయాన్ని ఈ చిత్రానికి కేటాయించిందని దర్శకుడు అయాన్ ముఖర్జీ తెలిపారు. అయితే ఈ సినిమా మూడు పార్టులుగా వస్తుందని ముందుగానే ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో మొదటి పార్ట్ పూర్తి అవడంతో రిజల్ట్ తో సంబంధం లేకుండా సెకండ్ పార్ట్ తెరకెక్కించడానికి సన్నాహాలు చేస్తున్నారు.

## వాల్తేరు వీరయ్యలో నాగ్ గెస్ట్ రోల్

చిరంజీవి మాత్రం వరుసగా సినిమాలను చేస్తూ బిజీ బిజీగా గడుపుతున్నాడు. అందులో బాబీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'వాల్తేరు వీరయ్య' ఒకటి. యాక్షన్ ఎంట్టంల్గ÷నర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రం ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది. కాగా తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ఓ వార్త నెట్టింట వైరల్‌గా మారింది. ఈ చిత్రంలో మాస్‌రాజా రవితేజ కీలకపాత్రలో నటించనున్న విషయం తెలిసిందే. కాగా ఇప్పుడు మరో ఇద్దరు స్టార్ హీరోలు గెస్ట్‌రోల్‌లో మెరవనున్నారట. విక్టరీ వెంకటేష్, నాగార్జున అతిథి పాత్రల్లో కనిపించనున్నట్లు టాలీవుడ్ వర్గాల సమాచారం. ఇందులో నిజమెంతుందో తెలియదు కాదు. ఈ ముగ్గురు హీరోలు ఒకే సారి స్క్రీన్ పై కనిపిస్తే మాత్రం ఫ్యాన్స్ సంబురాలు చేసుకుంటారు. ఈ చిత్రంలో చిరు అండర్ కవర్ కాప్‌గా కనిపించనున్నాడు. చిరుకు జోడీగా శృతిహాసన్ హీరోయిన్‌గా నటిస్తుంది. మైత్రీ మూవీ సంస్థ తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదల చేయాలని మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

## హంట్ సినిమా పోస్టర్ విడుదల

హిట్లు, ఫ్లాప్ లతో సంబంధంలేకుండా కొత్తదనంతో కూడిన కథాంశాలను ఎంచుకుంటూ హీరోగా వైవిధ్యతను చాటుకుంటున్నాడు సుధీర్‌బాబు. మొదటి నుండి విభిన్న కథలను ఎంచుకుంటూ వస్తున్న సుధీర్ బాబుకు 'సమ్మోహనం' మంచి బ్రేక్ ఇచ్చింది. ఆ తర్వాత వరుసగా 'వి', 'శ్రీదేవి సోడా సెంటర్' వంటి సినిమాలతో టాలీవుడ్‌లో మంచి నటుడిగా ప్రత్యేక గుర్తింపును తెచ్చుకున్నాడు. ఇటీవలే ఈయన నటించిన 'ఆ అమ్మాయి గురించి మీకు చెప్పాలి' అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. ఈ చిత్రానికి పాజిటీవ్ టాక్ వచ్చినా కలెక్షన్లు మాత్ర ఆశించిన స్థాయిలో రాలేకపోయాయి. ప్రస్తుతం ఆయన నాలుగు సినిమాలను సెట్స్‌పైన ఉంచాడు. అందులో 'హంట్' ఒకటి. ఈ సినిమాతో మహేష్ దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. ఇక ఇటీవలే విడుదలైన మ మోషన్ పోస్టర్‌కు ప్రేక్షకుల నుండి విశేష స్పందన వచ్చింది. తాజాగా మేకర్స్ సుధీర్ బాబు లుక్‌ను విడుదల చేశారు. లేటెస్ట్‌గా విడుదలైన పోస్టర్‌లో సుధీర్ బాబు చేతిలో సిగరెట్ పట్టుకుని ఇంటెన్సీవ్ కళ్ళతో చూస్తున్నాడు. క్లాస్ లుక్‌లో సుధీర్ బాబు పోస్టర్ ఆకట్టుకుంటుంది. ఈ చిత్రంలో సుధీర్ బాబు అర్జున్ ప్రసాద్‌గా కనిపించనున్నాడు. కాగా ఈ సినిమా టీజర్ అనౌన్స్‌మెంట్‌ను శనివారం సాయంత్రం వెల్లడించనున్నట్లు మేకర్స్ తెలిపారు. ఈ చిత్రంలో హీరో శ్రీకాంత్, తమిళ నటుడు భరత్ కీలకపాత్రల్లో నటిస్తున్నారు. భవ్య క్రియేషన్స్ పతాకంపై వి.ఆనంద్ ప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాడు. జిబ్రాన్ సంగీతం అందించనున్న ఈ మూవీ ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది.




Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8897334003 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in